క్లుప్తంగా

నిర్ణీత సమయానికి టీకాలు అందించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, ఆర్.సుదర్శన్‌బాబు ఆధ్వర్యంలో ఆలమూరు-1. ఆలమూరు-2, పెనికేరు, పినపళ్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, గుమ్మిలేరు గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. చిన్నారులకు పలు రకాల వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు అందజేశారు.

గడ్డి లారీ దగ్ధం


ప్రమాద స్థలంలో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మలికిపురం/సఖినేటిపల్లి: మలికిపురం-ఉయ్యూరి వారి మెరక గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం గడ్డితో వెళ్తున్న లారీ దగ్ధమైంది. భారీ ఎత్తున గడ్డి లోడుతో వెళ్తున్న లారీకి హెచ్‌టీ విద్యుత్ తీగలు తగిలి మంటలు రేగాయి. మంటలతో వెళ్తున్న లారీని స్థానికులు గమనించిన అప్రమత్తం చేశారు. వెంటనే గడ్డిని కిందకు దించి లారీని కాపాడే ప్రయత్నం చేశారు. ఈ లోపు రాజోలు నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. నివాస గృహాల సముదాయం, ప్లాస్టిక్ వ్యాపార గొడౌన్లు ఉన్న ఈ ప్రాంతంతో చుట్టు పక్కలకు మంటలు వ్యాపించక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దట్టమైన పొగ వ్యాపించడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఆందోళన

మామిడికుదురు: విద్యుత్ కోతలను నిరసిస్తూ పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో శుక్రవారం రాత్రి 11 గంటలకు స్థానికులు నిరసన తెలియజేశారు. అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వాపోయారు. గ్రామంలోని నెల్లివారిమెరకలో రెండేళ్ల క్రితం కాలిపోయిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే పునరుద్ధరించాలని, లో-ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లైన్‌మెన్ స్థానికంగా అందుబాటులో ఉండడం లేదంటూ నిరసన తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో నగరం విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణ ప్రాంత రోగుల ముంగిటకు తీసుకువచ్చి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. దీనిని ప్రతి రోగి సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. సచివాలయ సెక్రటరీ వెంకట్, ఏఎస్‌ఎం ఎన్‌వీ పద్మావతి, ఆశాలు వారా మంగ, దుర్గ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పించాలి

మామిడికుదురు: జగనన్న సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష పథకం ద్వారా సర్టిఫికెట్లకు సంబంధించి, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఉన్న సమస్యలను గుర్తిస్తారని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష పథకం అమలవుతుందన్నారు. పది రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష పథకం ద్వారా అందిస్తారని చెప్పారు. ఈ పథకంపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తపేట: మండలంలోని మందపల్లి సమీపాన శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన నాటి శ్రీరాములు తన భార్య లక్ష్మితో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై ముమ్మిడివరంలో తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఊబలంక వెళ్తుండగా మందపల్లి వంతెన సమీపంలో రావులపాలెం వైపు నుంచి ఎదురుగా వచ్చిన చిన్న కారు ఢీకొంది. దీంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్రీరాములు చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణులకు చేరువైన వైద్య సేవలు

- సత్ఫలితాలిస్తున్న ఫ్యామిలీ డాక్టర్
- వైద్య సేవలకు ప్రజల మన్ననలు


పాశర్లపూడి బాడవలో రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్పందన

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలందించాలన్న దృఢ సంకల్పంతో ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. దీని ద్వారా ప్రతి గ్రామంలోను మారు మూల ప్రాంతాల ప్రజలకు సైతం వైద్య సేవలందిస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వ డాక్టర్‌తో పాటు సిబ్బంది 104 వాహనం ద్వారా వచ్చి వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నారు. గతంలో పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం ప్రజలకు భారంగా ఉండేది. దాని వల్ల రోగులు ప్రభుత్వాస్పత్రులకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తర్వాత ప్రభుత్వ వైద్య సేవలు పొందే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే సేవలు..

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఉదయం 104 వాహనం వద్ద వైద్య సేవలందిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో మంచం పట్టిన రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. వీటితో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మామిడికుదురు మండలంలో అందుబాటులో ఉన్నవి...

104 వాహనాలు 2, ఇద్దరు డాక్టర్లు, నలుగురు సిబ్బంది, రోజుకు సగటున పరీక్షలు చేయించుకుంటున్న రోగుల సంఖ్య 200.

ప్రతి నెలా వైద్య పరీక్షలు చేస్తున్నారు



ప్రతి నెలలో రెండు సార్లు 104 వాహనం ద్వారా మా ప్రాంతంలో వైద్య సేవలందిస్తున్నారు. నేను బీపీతో పాటు ఇతర సమస్యలను డాక్టర్‌కు చెప్పి వారి నుంచి సలహాలు, సూచనలతో పాటు ఉచితంగా మందులు తీసుకుంటున్నాను. ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. దీని ద్వారా ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– నిడదవోలు వరప్రసాద్, పాశర్లపూడి

నాకు అండగా ఉంటున్నారు



గతంలో ప్రభుత్వ వైద్య సేవలు పొందాలంటే సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా ఇంటికి సమీపంలోనే వైద్య సేవలందిస్తున్నారు. నెలకు రెండు సార్లు డాక్టర్ మా ప్రాంతానికి వస్తున్నారు. నాకు బీపీ, సుగరు సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలకు సంబంధించి ప్రతి నెలా డాక్టర్‌కు చూపించి మందులు తీసుకుంటున్నాను.

– కుంపట్ల అనంతలక్ష్మి, పాశర్లపూడి

మంచి సేవలందిస్తున్నారు



ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వచ్చి ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఏ రోజు మా గ్రామం వస్తున్నారో ముందుగానే మాకు సమాచారం అందిస్తున్నారు. అదే రోజు మేము అక్కడకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నాం. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు.

– సాధనాల తాతారావు, పాశర్లపూడి

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు అన్నారు. ఇసుకపూడి గ్రామ పంచాయతీ వద్ద ఇంటింటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జలజీవన్ మిషన్ నియోజకవర్గ టీమ్ సభ్యులు బొంతు చందు, బి.వెంకటరమణ, జి.సురేంద్రలు పాల్గొని అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షులు బొంతు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ, పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

మలికిపురం: విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయం సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. రామరాజులంక ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను ఆమె పంపిణీ చేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఉప సర్పంచ్ మేడిచర్ల గంగరాజు, నాయకులు నల్లి శివకుమార్, హెచ్‌ఎం జి.సారా గ్రేస్, విద్యా కమిటీ చైర్మన్ ఎం.సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి


మాచవరంలో అనూషను సన్మానిస్తున్న ఎంపీటీసీ, హెచ్‌ఎం, స్థానికులు

అంబాజీపేట: సమాజానికి, పాఠశాల అభివృద్ధికి ఉత్తమ సేవలందించిన వారు ప్రజల హృదయాల్లో స్థిర స్థాయిగా నిలిచిపోతారని ఎంపీటీసీ మట్టా పార్వతి అన్నారు. మాచవరం శివారు బెహరావారి అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న రాయుడు బేబీ అనూషను శనివారం ప్రధానోపాధ్యాయులు వాసంశెట్టి నాగవేణి అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కోట గోపి, పీఎంసీ చైర్మన్ యలమంచిలి తాతారావు, కుసుమ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు డి.సూర్యకళ, సీఆర్పీ ఎస్.వెంకటేష్, స్థానికులు కొల్లూరి బలరామకృష్ణ, కొల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డుల మంజూరుకు సహకరించాలి

అంబాజీపేట: కౌలు కార్డులు మంజూరుకు సొంత భూమిని కౌలుకు ఇచ్చిన రైతులంతా సహకరించాలని తహసీల్దార్ టి.మంగతాయారు కోరారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో కౌలు కార్డులు మంజూరుపై శనివారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తమ భూమిని కౌలుకు ఇచ్చిన చాలా మంది రైతులు కౌలు రైతుకు కౌలు కార్డు మంజూరు చేయడానికి అనుమతి ఇవ్వడానికి సంకోచిస్తున్నారన్నారు. కౌలు కార్డుకు కేవలం 11 నెలలు మాత్రమే కాల పరిమితి ఉంటుందన్నారు. అది కూడా కౌలుకు వ్యవసాయం చేస్తున్న కౌలు రైతు తమ పంటకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రం ద్వారా పొందడానికి, పండించిన పంటను అమ్ముకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కౌలు కార్డు కావాల్సిన వారు జెరాక్స్, పాస్‌పోర్టు ఫొటో ఇస్తే కొత్త కౌలు కార్డు ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోపు కొత్త కౌలు కార్డులు తీసుకోవాలని ఆమె కోరారు. కౌలు కార్డుల అవసరమైన వారికి వివరించాలని వీఆర్వోలకు సూచించారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మామిడికుదురులో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1972–73లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు యెరుబండి లక్ష్మయ్య, పీఎస్‌ఆర్‌కే పరమహంసలకు పాదపూజ చేసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. అంతా కలసి తమ స్నేహితులతో గ్రూపు ఫొటోలు తీయించుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, కమిటీ చైర్మన్ జాలెం రాంబాబు, మైలవరపు రవీంద్రనాథ్, సిర్రా జగ్గారావు, ఈలి వీరాస్వామి, కశిలంక సత్యనారాయణ, శిష్టా సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశాలు


వీవీమెరక శివారు ప్రగతి నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరక శివారు ప్రగతి నగర్‌లో నెలకొని ఉన్న విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలకై అధికారులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదేశాలు శనివారం జారీ చేశారు. వీటిపై స్థానికులు ఎమ్మెల్యేను కలుసుకుని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే స్వయంగా ప్రగతినగర్‌కు విచ్చేసి, అక్కడ ఉన్న జై భీమ్ సామాజిక భవనం వద్ద స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమస్యలపై చర్చించారు. వీటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఎమ్మెల్యే వారికి చేశారు. తక్షణం విద్యుత్, తాగునీటి సమస్యలపై పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు ఆయన జారీ చేశారు. దీంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

అవయవ దానం


దేవ మంగాయమ్మ (ఫైల్)

మలికిపురం: మండలంలోని దిండికి చెందిన రిటైర్డ్ హిందీ టీచర్, కమ్యూనిస్ట్ పార్టీ మహిళా నాయకురాలు దేవ మంగాయమ్మ (83) శనివారం నగరంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త దేవ మునలయ్య కార్మిక సంఘ నాయకుడిగా పనిచేసి ఆరేళ్ల క్రితం చనిపోయారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మరణానంతరం సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ కుమార్ చొరవతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్రనిధి బ్యాంకుకు, భౌతిక దేహాన్ని వైద్య పరిశోధన నిమిత్తం కృష్ణా జిల్లా గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించినట్టు కుమారుడు దేవ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పలువురు ప్రముఖులు ఆమె భౌతికదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. శని అమావాస్య పురస్కరించుకుని అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ రూపాల్లో టిక్కెట్ల ద్వారా రూ.1,33,118 ఆదాయం, అన్నదాన విరాళంగా రూ.16,624 వచ్చినట్టు ఈఓ సింగం రాధ తెలిపారు. సుమారు 400 మంది భక్తులకు నేతితో తయారు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఐఏఎస్ అధికారి, మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్ఎమ్ గోనేలా, సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ డాక్టర్ విమల దంపతులు, స్టేట్ ఎండోమెంట్స్ విజిలెన్స్ అధికారి డీవీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు.

'పశు బీమా'ను వినియోగించుకోవాలి

అంబాజీపేట: పశువులు గొర్రెలు, మేకలు మరణిస్తే పశుపోషకులకు ఆదాయంగా నిలబడేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనిని పాడి రైతులు వినియోగించుకోవాలని పి.గన్నవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు విజయరెడ్డి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో అంబాజీపేట పశువైద్యాధికారి డి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ పశుబీమా పథకాన్ని శనివారం ప్రారంభించారు. వరదలు, తుపానులు, పిడుగుపడి చనిపోవుట, పాముకాటు, అటవీ జంతువుల దాడి, అగ్ని ప్రమాదం, రోడ్డు మరియు రైలు ప్రమాదాలు, పశువులు వ్యాధి బారిన పడి చనిపోవడం మొదలైన సందర్భాల్లో వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, ఆర్బీకే చైర్మన్ రాయుడు చంటి పాల్గొన్నారు.

ఏపీలో మళ్లీ జగనన్నే సీఎం


సింగపూర్‌లో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యులతో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: మన ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కానున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శనివారం మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో అక్కడ వైఎస్సార్ సీపీ సింగపూర్ ఎన్నారై విభాగం సభ్యులతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా జగ్గిరెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సైతం సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలు అమలు చేసి పేద ప్రజలను ఆదుకున్న ఘనత దేశ వ్యాప్తంగా జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలనే సంకల్పంతో ప్రజలు ఎదురు చూస్తున్నారని జగ్గిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అక్కడకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్‌ఆర్‌టీఎస్) సభ్యులను కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ విశిష్టతను వివరించి, దర్శనానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సింగపూర్ విభాగం కన్వీనర్ దువ్వూరు మురళీకృష్ణారెడ్డి, సింగపూర్ తెలుగు సమాజం మాజీ ప్రెసిడెంట్ కొమ్మిరెడ్డి కోటిరెడ్డి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ కోఆర్డినేటర్ మేడపాటి సందీప్‌కుమార్‌రెడ్డి, ఆయా విభాగాల సభ్యులు జీవన్, ప్రసాద్, రామచంద్రారెడ్డి, సంతోషచంద్ర, ఆంజనేయరెడ్డి, విజయభాస్కరరెడ్డి, నల్లమిల్లి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రి నూతన భవన నిర్మాణం

అంబాజీపేట: ముక్కామలలో పశువుల ఆస్పత్రి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. శిథిలావస్థలో పశువైద్య శిబిరం అనే శీర్షికలు 'సాక్షి' దినపత్రికలో పలుమార్లు ప్రచురించడంతో వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానిక పంచాయతీ ఎదురుగా ఉన్న స్థలంలో ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.34 లక్షలతో నిర్మించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు పశువైద్యాధికారి జి.శ్రీనివాస్ శనివారం తెలిపారు. మరో మూడు నెలలో భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం శిథిలమైన పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నామన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమాలను అంబాజీపేట మండలంలో 13, పి.గన్నవరం మండలంలో 4 గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు.

70 కుటుంబాలకు తాగునీరు అందజేత

మామిడికుదురు: తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న మొగలికుదురు గ్రామ పరిధిలోని వీవర్స్ కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 70 కుటుంబాలకు శనివారం పలువురు దాతలు తాగునీరు అందించారు. బద్దే జయప్రకాష్, చిట్టూరి వెంకటరమణ, ఇనుమర్తి మోహనరావులు ఒక్కో కుటుంబానికి 20 లీటర్ల వంతున మినరల్ వాటర్ అందించి మానవత్వం చాటుకున్నారు. మరో మూడు రోజుల పాటు ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తామని దాతలు చెప్పారని అంకం నాగపల్లేశ్వరరావు చెప్పారు. ఉచితంగా తాగునీరు అందించిన దాతలకు మూడు కాలనీల వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీవీ, జాన రాజు కడి రంగ, లక్కింశెట్టి సత్యసాయిబాబా పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నూతన ఎంఈవోగా కిషోర్‌కుమార్

సఖినేటిపల్లి: మండల విద్యాశాఖాధికారిగా దొండపాటి కిషోర్‌కుమార్ శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎంఈవో కార్యాలయంలో కిషోర్‌కుమార్‌కు పుష్పగుచ్ఛంతో ఉపాధ్యాయులు, టీచర్ల యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. అలాగే ఇంత వరకూ ఎంఈవోగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న నల్లి మనోహరంకు కూడా పుష్పగుచ్ఛంతో వారు వీడ్కోలు పలికారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి


రావులపాలెంలో ఎఫ్‌పీఓల శిక్షణలో రైతుకు ఒప్పంద పత్రం అందజేస్తున్న డీడీఎం నాయుడు

రావులపాలెం: రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డీడీఎం) డాక్టర్ వైఎస్ నాయుడు సూచించారు. శనివారం స్థానిక భాస్కర హోటల్ ఫంక్షన్ హాలులో జాతీయ పది వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు పథకం చిన్నకారు రైతుల వ్యవసాయ వ్యాపార కన్సార్టియం (ఎస్ఎఫ్ఏసీ) అండ్ నాబార్డ్ కింద ఏర్పాటు చేసిన 9 మండలాల ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లకు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. నాబార్డ్ జిల్లా డీడీఎం డాక్టర్ నాయుడు మాట్లాడుతూ రైతులు సమైఖ్యంగా ఉంటూ ఎఫ్‌పీఓ ద్వారా వారి ఉత్పత్తులను వారే విలువ పెంచుకునే విధంగా ప్రాసెసింగ్ చేసి పండించిన పంటకు మంచి రేట్లు పొందాలని సూచించారు. అనంతరం డ్రోన్ల డెమాన్‌స్ట్రేషన్‌కు సంబంధించి బిగ్ హార్వెస్ట్ కంపెనీతో ఒప్పందాన్ని 9 మండలాల ఎఫ్‌పీఓలతో చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఎఫ్ నుంచి సునీల్, విజయ్, బ్రహ్మ, సతీష్, సీఈఓలు, సుమారు 70 మంది రైతులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించాలి


ఆలమూరులో నిర్వహించిన గ్రామ సచివాలయ ఉద్యోగుల సమీక్ష

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అర్హులైన వారందరికి వర్తింపజేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించగా ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య సిబ్బందికి విధిగా మహిళ సంరక్షణ కార్యదర్శులు సహకరించాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలను అందించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. మండల ఇంజినీరింగ్ జేఈ కె.మురళీకృష్ణ, గ్రామ సంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, ఆర్‌వీవీ సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, కెమోక్షాంజలి, ఎస్.వీర్రాజు, యు.రేణుక, సుప్రియ, వెంకటరెడ్డి, అయ్యన్న, సీహెచ్ వీరమాత, వేణు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో ఉన్నత ప్రమాణాలు

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యా వ్యవస్థలో ఉన్నత ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రావులపాలెం జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు కోరారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రావులపాలెం మండల శాఖ రూపొందించిన 'ఉపాధ్యాయ డైరీ' ఆవిష్కరణ కార్యక్రమం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా అన్ని సౌకర్యాలతో చదువుకుని అత్యుత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్లు కేవీ శేఖర్, గంధ్రోతు నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పి.మరియన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణతో మెరుగైన దిగుబడులు

అయినవిల్లి: మట్టి నమూనాల సేకరణతో రైతులు తమ పంట పొలంలో లోపించిన పోషకాలను అందించి మరింత మెరుగైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎంఏ షంషీ అన్నారు. శనివారం మండలంలోని సిరిపల్లి ఆర్బీకేను వీరు సందర్శించారు. పీఎం కిసాన్, వీ-కేవైసీ అవ్వని వారు త్వరగా చేయించుకోవాలన్నారు. అనంతరం మట్టినమూనా సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఇప్పటి వరకూ 150 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించామన్నారు. రైతులు జూన్ నెలాఖరుకు నారుమడులు పూర్తి చేయాలన్నారు. యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. వీరి వెంట ఏవో శోభ తదితరులు ఉన్నారు.